క్లుప్తంగా

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం


మాట్లాడుతున్న భానుమతి

సుజాతనగర్: మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. స్థానిక ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో శనివారం న్యాయ చైతన్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువత బాధ కలిగినప్పుడు మత్తు పదార్థాలకు అలవాటు పడి వ్యసనంగా మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలతో అత్యున్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. వి.పురుషోత్తమరావు, పి.నిరంజన్‌రావు, రామకోటేశ్వరరావు, నాగరాజు, ఎస్సై, షీ టీమ్ ఎస్సై పాల్గొన్నారు.

బాలమేళాలో విద్యార్థులకు బహుమతులు


తుమ్మలచెలక ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతున్న రవి

టేకులపల్లి: తరగతి గదుల్లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానాన్ని, నైపుణ్యాలను (విద్యార్థుల అభ్యాస ప్రదర్శన) పరిశీలన చేసే విధానంతో విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎల్‌ఎన్ బాల మేళా పరిశీలన బృందం శనివారం కుంటల్ల కాంప్లెక్స్ పరిధిలోని తుమ్మలచెలక ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. తరగతుల వారీగా విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. చదివించడం, రాయించడం, విభిన్న నేపథ్యాల నుంచి అన్ని కోణాల్లో అంశాలను అడిగి రాబట్టారు. తరగతుల వారిగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆత్మలింగేశ్వరాలయాన్ని సందర్శించిన సాధువులు


ఆలయంలో సాధువులు

పాల్వంచ: పట్టణంలోని ఆత్మలింగేశ్వరాలన్ని వారణాసికి చెందిన పలువురు సాధువులు శనివారం సందర్శించారు. భద్రాచలం రామాలయాన్ని సందర్శించి తిరుగు ప్రయాణంలో 20 మంది ఇక్కడి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారిని ఆహ్వానించి వసతి కల్పించారు.

మౌలిక వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: ఏజెన్సీ గ్రామాల్లో ఏళ్ల తరబడి బాహ్య ప్రపంచానికి దూరంగా నివాసం ఉంటున్న వలస ఆదివాసీ గిరిజనులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధి ప్రభాత్‌నగర్ శివారం ఆదివాసీ ఎస్టీ కాలనీలో శనివారం సీపీఐ శాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశంలో పుట్టిన ప్రతిబిడ్డకు పౌరహక్కులను రాజ్యాంగం కల్పించిందన్నారు. పొరుగు రాష్ట్రం నుంచి 30 ఏళ్ల క్రితం వలస వచ్చి మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో జీవనం సాగిస్తున్న ఆదివాసీ గ్రామాలకు ఏ ప్రభుత్వం కనీసం రహదారి, విద్యుత్, తాగునీటి వంటి కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. గిరిజనులపై ఫారెస్ట్, పోలీసు దాడులను నిలిపివేయాలని, పోడు సాగు పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వ్యాపారి మృతి


ఘనశ్యామ్ లహోటీ (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, వ్యాపారవేత్త ఘనశ్యామ్ లహోటీ (85) శనివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కనకయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మడత వెంకట్‌గౌడ్, బాస శ్రీనివాస్, సయ్యద్‌జానీపాషా, డానియేల్, పులి సైదులు, గోచికొండ సత్యనారాయణ, శ్రీదేవీ, ఎస్‌కే జానీ, మాధవరావు, కె.సంజీవ రెడ్డి, మాధవ్, నాగరాజు, శ్రీనివాస్, కె.సారయ్య, నజీర్ అహ్మద్, నాగయ్య, ఎస్‌పి నబీ, కిరణ్, తుపాకుల నాగేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, యాకుబ్‌షావలీ, ముద్రగడ వంశీ ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

సింగరేణి సాయం.. అసంపూర్ణం

- గ్రామపంచాయతీల బాధ్యతా రాహిత్యం
- అధ్వానస్థితికి చేరుతున్న భారీ నిర్మాణాలు
- అసౌకర్యాలతో వినియోగానికి దూరం
- రూ.కోట్ల వ్యయం.. నిరుపయోగం

ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి, సౌకర్యాల కల్పన కోసం సింగరేణి పలు రూపాల్లో కృషి చేస్తోంది. దీనికోసం సంస్థ ద్వారా పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేస్తుంది. ఆయా నిధులతో ప్రజాఉపయోగ నిర్మాణాలు చేపడుతోంది. కానీ నిర్వహణ ఎవరి బాధ్యత ఎవరిదో సమాధానం లేకపోవడం.. నిర్మాణం తరువాత సింగరేణి చేతులు దులుపుకోవడం, నిర్మాణాలు చేపట్టిన ప్రాంత పంచాయతీ అధికారులు నిర్వహణను విస్మరించడంతో ఖర్చు చేసిన భారీ వ్యయం వృథా ప్రయాసే అవుతోంది.

ఇల్లెందురూరల్: బొగ్గు గనుల ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి సింగరేణి, డీఎంఎఫ్‌టీ ద్వారా ఇల్లెందు ప్రాంతంలో సుమారు రూ.పది కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. ఆయా నిధులతో రొంపేడు, ఒడ్డుగూడెం, పూసపల్లి, కొమ్ముగూడెం, తిలక్‌నగర్, సీఎస్పీబస్తీ గ్రామాలలో ఒక్కోచోట ఒక్కో రకమైన నిర్మాణాలు చేపట్టారు. ఆయా గ్రామాలలో సీసీ, బీటీ రోడ్లు, కాల్వలు, ప్రభుత్వ, అంగన్‌వాడీ పాఠశాలలు, పంచాయతీ, సబ్‌సెంటర్ భవనాలు, తాగునీటి పథకం, వ్యవసాయ గిడ్డంగి, కమ్యూనిటీ హాల్స్, పార్క్, వంటి నిర్మాణాలు చేపట్టారు.

నిర్వహణ లేక శిథిలావస్థకు..

ఎంపిక చేసిన గ్రామాలలో ఇతర నిర్మాణాలను మినహాయిస్తే కమ్యూనిటీ హాల్స్, వ్యవసాయ గిడ్డంగులు నిర్వహణ లేక అధ్వాన స్థితికి చేరుకున్నాయి. సుమారుగా రూ.25 లక్షల వ్యయంతో ఎంతో అందంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్స్‌ను ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ విద్యుత్, నీరు, వంటషెడ్లు, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించలేదు. ఇవన్నీ తమ బాధ్యత కాదని పంచాయతీలు చూసుకోవాలని సింగరేణి అధికారులు చెపుతుండగా నిధుల లేమి సాకుతో పంచాయతీ అధికారులు సౌకర్యాల కల్పనను విస్మరించారు. దీంతో ఆలనాపాలనా లేక ఐదు గ్రామాలలో సుమారు రూ.కోటికి పైగా వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అంతేకాకుండా రొంపేడులో రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ గిడ్డంగి వినియోగానికి నోచుకోవడం లేదు.


నీరు, విద్యుత్ సౌకర్యం లేని తిలక్‌నగర్ కమ్యూనిటీ హాల్


నీటి ట్యాంకు ఏర్పాటుకు నిర్మించిన పిల్లర్

ఉచిత సేవల మాటున..

ఐదు గ్రామాలలో నిర్మించిన కమ్యూనిటీ హాల్స్‌ను పంచాయతీ అధికారులు మాత్రం ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్ల మాదిరిగా ఉచిత సేవలకు పరిమితం చేస్తున్నారు. వివాహాలు, సభలకు ఉచితంగా ఇస్తున్నారు. అంతేకాకుండా విద్యుత్ సౌకర్యం లేని చోట కాంతులు ఎలా విరజిమ్ముతున్నాయో.. ఫ్యాన్లు ఎలా తిరుగుతున్నాయో.. ఎవరూ పరిశీలించిన దాఖలాలు లేవు. విద్యుత్ సౌకర్యం లేనిచోట అక్రమంగా సౌకర్యం పొందడం నేరమే అయినా.. ఈతంతు యథేచ్ఛగా సాగుతోందని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

ఉన్నతాధికారుల ప్రేక్షక పాత్ర..

గ్రామాలలో సింగరేణి, డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్స్, వ్యవసాయ గిడ్డంగుల పరిస్థితి ఎలా ఉంది.. వినియోగంలో ఉన్నాయా.. వీటి ద్వారా గ్రామపంచాయతీలకు ఏ మేరకు ఆదయం సమకూరుతోంది.. ఆదాయాన్ని ఏం చేస్తున్నారు.. ఆయా నిర్మాణాల నిర్వహణ ఎలా ఉంది.. వంటి విషయాలను గ్రామాల సందర్శన సమయంలో ఉన్నతాధికారులు మాట వరుసకైనా తనిఖీ చేసిన దాఖలాలు లేవు. దీన్ని సాకుగా తీసుకొని క్షేత్రస్థాయి అధికారులు ఆయా నిర్మాణాల నిర్వహణ గాలికొదిలేశారని ఆరోపణలు ఉన్నాయి.

సౌకర్యాలు కల్పిస్తే..

ఐదు గ్రామాలలో నిర్మించిన కమ్యూనిటీ హాల్స్‌లో విద్యుత్, నీరు, మరుగుదొడ్లు, వంటషెడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. నీటి కోసం మిషన్ భగీరథను, మరుగుదొడ్లు, వంటషెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకాన్ని, విద్యుత్ సౌకర్యం కోసం బిల్లు చెల్లిస్తే సరిపోతుంది. దీంతో ఆయా కమ్యూనిటీ హాల్స్‌లో శుభకార్యాలు, సభలు, సమావేశాలు నిర్వహణకు అవకాశం ఉంటుంది. తద్వారా పంచాయతీలకు కూడా ఆదాయం సమకూరి గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తుంది.

సౌకర్యాలు లేవు..



సింగరేణి సహకారంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్స్‌లో సౌకర్యాలు లేవు. విద్యుత్, తాగు నీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంట షెడ్డు నిర్మాణాలను విస్మరించారు. ఫలితంగా ఖర్చు చేసిన భారీ వ్యయం నిరుపయోగంగా మారింది,

– యదళ్లపల్లి కృష్ణ, తిలక్‌నగర్

ఉన్నతాధికారులు స్పందించాలి..



గ్రామాలలో సింగరేణి ద్వారా నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. సౌకర్యవంతంగా తీర్చిదిద్దితే పంచాయతీలకు అదాయం పెరుగుతుంది. ప్రజలకు శుభ కార్యాల నిర్వహణలో ఆర్థిక భారం తగ్గుతుంది.

– బొప్పిశెట్టి సత్యనారాయణ, 21పిట్ ఏరియా

స్కూళ్లలో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ నెల మూడో శనివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్స్ నాగరాజశేఖర్, సైదులు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని ఎంపీయూపీఎస్, పెనుబల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలంలోని పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల, గ్రామస్తుల సహకారం చాలా అవసరమని, విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు, హెచ్‌ఎం పాల్గొన్నారు.

నేడు టీయూసీఐ జిల్లా మహాసభ



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ఉర్దూ ఘర్‌లో నిర్వహించనున్న టీయూసీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి యాకూబ్ షావలీ అన్నారు. ఆదివారం జరుగునున్న మహాసభను జయప్రదం చేయాలని శనివారం కొత్తగూడెంలోని పలు కార్మికుల అడ్డాలలో ప్రచారం నిర్వహించారు. గోపాలరావు, పెద్దబోయిన సతీష్, రాజశేఖర్, సుందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ


గొడుగు అందజేస్తున్న స్వర్ణలత లెనీనా

కొత్తగూడెంటౌన్/ఇల్లెందు: పట్టణాల్లో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్న వీధి వ్యాపారులకు నీడ కోసం జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనినా గొడుగులు పంపిణీ చేశారు. వ్యాపారులతో మాట్లాడుతూ.. ఎండకు ఎండుతూ వానకు తడిచి చిరు వ్యాపారాల ద్వారా జీవనం సాగించే వారికి నీడ కోసం గొడుగు అందజేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా శనివారం ఆమె ఇల్లెందు, కొత్తగూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. చిన్నారులకు అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు. ఆయా సెంటర్లలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారత దిశగా పయనిస్తున్నందున ఇప్పటికే పలు అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చే దిశగా ఒక్కో సెక్టార్‌లో ఒక భవనం తీర్చిదిద్దుతున్నామని, చాలా సెంటర్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. వేగంగా సెంటర్లకు రంగులు, విద్యుత్ మీటర్ల ఏర్పాటు, బాత్ రూం, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీడీపీఓ అరుణకుమారి, సూపర్‌వైజర్లు రమాకళ, రోహిణి, అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు. అనంతరం మండలంలోని పలు అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేశారు.

క్రీడా పోటీల్లో లిఖిత ప్రతిభ


లిఖితను సన్మానిస్తున్న ఏడీఈ మధుబాబు

పాల్వంచ: ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఇంటర్ సర్కిల్ ట్రాన్స్‌కో అండ్ డిస్కం క్రీడా పోటీల్లో పాల్వంచ టౌన్ సబ్ ఇంజనీర్ లిఖిత ప్రతిభ కనబర్చింది. డిస్కస్ త్రో, లాంగ్ జంప్‌లో ప్రథమ, జావలిన్ త్రోలో తృతీయ, 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ, రూరల్ చాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లిఖితను అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ మధుబాబు, ఏఈలు ప్రతాప్, రవీందర్ లిఖితను సన్మానించి అభినందించారు.

గురుకుల విద్యార్థులకు బహుమతులు

పాల్వంచరూరల్: కొత్తగూడెంలోని సింగరేణి హైస్కూల్‌లో శనివారం జరిగిన సైన్స్ ఎక్స్‌పో-2025లో పాల్వంచ గురుకుల సీఓఈ విద్యార్థులు కన్సలేషన్ బహుమతులు సాధించారు. తొలి అడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 600 ప్రాజెక్టులు పాల్గొన్నాయి. సీఓఈకి చెందిన విద్యార్థులు ప్రదర్శించిన హైడ్రోపవర్ ప్లాంట్ ప్రాజెక్టుకు కన్సోలేషన్ బహుమతి దక్కింది. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రమశిక్షణ ఉన్నతికి సోపానం..


మాట్లాడుతున్న రషీద్

ఇల్లెందురూరల్: బాల్య దశ నుంచి క్రమశిక్షణతో కూడిన జీవన విధానం వ్యక్తి ఉన్నతికి సోపానంగా ఉంటుందని మదర్సా నజీమ్‌వభాని మహమ్మద్ మౌలానా ఇనాయితుల్లా రషీద్ అన్నారు. మోదుగులగూడెం మదర్సాలో శనివారం విలేకరుల ఆయన మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో మంచి కంటే చెడు చాలా వేగంగా వెంటపడుతోందని, తద్వారా చాలామంది చెడు అలవాట్లకు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. ఇలాంటి పరిస్థితిలో బాల్య దశ నుంచే సన్మార్గంలో పయనించి ఆదర్శ జీవనం సాగించేలా, చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో హాఫీజ్ ఖాజా ఫర్కార్ ఎండీ ఇబ్రహీం, మౌలానా మహమ్మద్ సలామితుల్లా, మౌల్వి మహమ్మద్ బషార్ తుల్లా, సయ్యద్ అబ్దుల్ హఫిజ్, ఎండీ ఆదమ్, మునజ్జమ్ బాబా పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం..


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు

ఇల్లెందురూరల్: దేశంలో శ్రమజీవుల ఐక్యతతో హిందుత్వ శక్తులను ఓడించి లౌకిక ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే, మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నర్సయ్య అన్నారు. ఈ నెల 28న మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం ఆయన ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. మాట్లాడుతూ... దేశంలో అందరూ సంతోషంగా ఉండాలని సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అంటూ పదేళ్ల ప్రధాని మోదీ తియ్యని నినాదం ఇస్తూ దేశ ప్రజల గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. వాస్తవానికి మోదీ ఇచ్చే నినాదంలో కార్పొరేట్ కా సాత్ కార్పొరేట్ కా వికాస్ అని రుజువవుతోందన్నారు. దేశంలో కార్పొరేట్ శక్తుల లాభాలు 22 శాతం పెరగడంతో మోదీ పాలన సంపన్నులకే ఉపయోగపడుతున్నట్లు తెలుస్తోందన్నారు. పదేళ్లుగా పేదలు, మధ్యతరగతి ప్రజల జీవనం మరింత దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని కోరారు. సమావేశంలో నాయిని రాజు, బిచ్చ, సావిత్రి, బుర్ర వెంకన్న, రాఘవులు, వెంకన్న, శ్రీరాంకోటయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం


టేకులపల్లి: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నేత దుబాకుల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను శనివారం టేకులపల్లిలో ఆవిష్కరించారు. మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అటకెక్కించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కల్తి వెంకటేశ్వర్లు, భూక్యా హర్జా, భూక్యా నర్సింగ్, గుగులోత్ రామచందర్, ఎట్టి నరసింహారావు, కోడెం రవి, బోడ మంచా, మంగీలాల్, బాలు, నోముల భానుచందర్, తోటకూరి సతీష్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20న న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాలలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, ఎట్టి నర్సింహారావు, ఉదయ్, మంగ్య, సంతు, శ్రీను, కృష్ణ, నర్సయ్య, సీతారాములు, సరోజిని, మెడెం వెంకన్న, పందిర్లపల్లి వీరన్న, లక్ష్మి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం)/సుజాతనగర్: ఆరు గ్యారంటీల అమలు, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకై ఈ నెల 20న హైదబాద్‌లో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని పలు సెంటర్లలో, సుజాతనగర్‌లో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గౌని నాగేశ్వరరావు, జే.సీతారామయ్య, ఎస్‌కే ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందు: సుభాష్‌నగర్‌లోని 2 కుంటల భూమిని స్థానిక వ్యక్తి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నాడని తక్షణం అతని మీద కఠిన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కె.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుభాష్‌నగర్ ఏరియాకు చెందిన పూనెం సూరయ్యకు చెందిన ఎకరం భూమిలో గొగ్గెల రామస్వామికి 2 కుంటలు 2016లో రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీన పర్చినట్లు తెలిపారు. ఆ భూమిని 1/70 చట్టానికి విరుద్ధంగా ఓ వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకునే యత్నం చేస్తున్నట్లు తెలిపారు.

క్షయ వ్యాధి నివారణపై ప్రచారం


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

జూలూరుపాడు: క్షయ వ్యాధి నిర్మూలనకు జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. 100 రోజుల టీబీ నిక్షయ్ షివిర్ కార్యక్రమంలో భాగంగా శనివారం పడమటనర్సాపురం గ్రామంలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... క్షయ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. దేశవ్యాప్తంగా 347 జిల్లాల్లో క్షయ వ్యాధి తీవ్రంగా ఉందని, తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది జిల్లాల్లో ఉండగా అందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒకటన్నారు. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఆయాసం, అలసట, తేమడలో రక్తం పడటం వంటివి క్షయ వ్యాధికి ప్రధాన లక్షణాలన్నారు. ఈ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని చెప్పారు. 60 సంవత్సరాలు పైబడిన వారు ఈ వంద రోజుల నిక్షయ్ షివిర్ కార్యక్రమంలో ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేయడంతోపాట, వ్యాధి తగ్గే వరకు పోషకాహార నిమిత్తం మందులు నెల రూ.1000 అందజేస్తుందన్నారు. సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, హెల్త్ సూపర్‌వైజర్ రత్నకుమార్, ఏఎన్‌ఎం పరమేశ్వరి, ఆశా కార్యకర్తలు జయమ్మ, రమణ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు


పాల్వంచ: పూజ చేస్తున్న జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య


టేకులపల్లి: దంతెలతండాలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బంజార గిరిజనుల ఆరాధ్యదైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్‌కు భోగ్‌బండారో(నైవేద్యం) సమర్పించారు. పలువురు మాట్లాడుతూ.... గిరిజనుల జీవన విధానం మెరుగు పర్చేందుకు దేశవ్యాప్త పర్యటన చేసి తన బోధనల ద్వారా గిరిజనులను చైతన్యం చేశాడని తెలిపారు. అహింసా మార్గం అచరణీయమని, దాని ద్వారా మాత్రమే గిరిజనుల జీవితాలు మెరుగు పడతాయని బోధన చేశాడన్నారు. సత్య నిష్టతో మెలిగి ప్రజలకు ఆరాధ్య దైవంగా మారాడని వివరించారు. సంత్ సేవాలాల్ మార్గం అనుసరించి ఆయన చూపిన భక్తి మార్గం ద్వారా గిరిజనులు అభివృద్ధి వైపు పయనించాలని కోరారు. ఆయన ఆశయాల కోసం అందరం కృషి చేయాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంటౌన్: పోస్టాఫీస్ సెంటర్‌లో..


ఇల్లెందు: వేడుకలో పాల్గొన్న జీఎం కృష్ణయ్య


ఇల్లెందురూరల్: భోగ్‌బండారోలో గిరిజనులు



సూపర్‌బజార్(కొత్తగూడెం): బంజారా నృత్యం చేస్తున్న విద్యార్థినులు, సుజాతనగర్: కోమటిపల్లిలో...


పాల్వంచరూరల్: పాండురంగాపురంలో...



జూలూరుపాడు: సురారంలో సేవాలాల్ విగ్రహావిష్కరణ, టేకులపల్లి: గోలియా తండాలో..